# దంచేసిన బట్లర్..

# సొంతగడ్డపై ఆర్సీబీ ఓటమి

## రాణించిన సుదర్శన్
## విజృంభించిన సిరాజ్, సాయికిశోర్
## గుజరాత్ ఘనవిజయం

బెంగళూరు: ఐపీఎల్-18లో గుజరాత్‌కు వరుసగా రెండో విజయం. బుధవారం ఆ జట్టు 8 వికెట్ల తేడాతో బెంగళూరును చిత్తు చేసింది. మొదట బెంగళూరు 8 వికెట్లకు 169 పరుగులు చేసింది. లివింగ్‌స్టన్ (54బీ 40 బంతుల్లో 1ఐ4, 5ఐ6), జితేశ్ శర్మ (33బీ 21 బంతుల్లో 5ఐ4, 1ఐ6), టిమ్ డేవిడ్ (32బీ 18 బంతుల్లో 3ఐ4, 2ఐ6) మెరిశారు. సిరాజ్ (3/19), సాయికిశోర్ (2/22), ప్రసిద్ధ్‌కృష్ణ (1/26) ఆర్సీబీకి కళ్లెం వేశారు. బట్లర్ (73 నాటౌట్‌బీ 39 బంతుల్లో 5ఐ4, 6ఐ6), సాయి సుదర్శన్ (49బీ 36 బంతుల్లో 7ఐ4, 1ఐ6) మెరవడంతో లక్ష్యాన్ని గుజరాత్ 17.5 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది.

**బట్లర్ ధనాధన్:** ఛేదనలో గుజరాత్ ఎలాంటి నాటకీయతకు అవకాశం ఇవ్వలేదు. బట్లర్ సూపర్ ఇన్నింగ్స్, సాయి సుదర్శన్ చక్కని బ్యాటింగ్‌తో ప్రశాంతంగా లక్ష్యాన్ని పూర్తి చేసింది. సుదర్శన్‌తో కలిసి ఛేదనను ఆరంభించిన గిల్ (14) త్వరగానే నిష్క్రమించాడు. అయిదో ఓవర్లో అతడు వెనుదిరిగేటప్పటికి స్కోరు 32. కానీ సుదర్శన్ నిలిచాడు. అతడు ఎక్కువ ధాటిగా ఆడకపోయినా చక్కగా స్ట్రైక్ రొటేట్ చేశాడు. అప్పుడప్పుడు అతడు బంతిని బౌండరీ దాటించగా.. మరోవైపు నుంచి బట్లర్ రెచ్చిపోవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. రసిఖ్ ఓవర్లో బట్లర్ రెండు సిక్స్‌లు, ఫోర్ బాదేశాడు. బట్లర్ ఓ సిక్స్, సుదర్శన్ రెండు ఫోర్లు కొట్టడంతో కృనాల్ ఓ ఓవర్లో 17 పరుగులు సమర్పించుకున్నాడు. ఆఖరి 8 ఓవర్లలో 65 పరుగులు చేయాల్సిన స్థితిలో.. గుజరాత్‌కు లక్ష్యం బాగా అందుబాటులోకి వచ్చింది. అయితే 13వ ఓవర్లో సుదర్శన్‌ను హేజిల్‌వుడ్ ఔట్ చేయడంతో 75 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. మ్యాచ్‌లో పుంజుకోవడానికి ఓ అవకాశం వచ్చిందని ఆర్సీబీ భావించి ఉంటుంది. కానీ రూథర్‌ఫర్డ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించిన బట్లర్ ఆ జట్టుకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. టైటాన్స్‌ను లక్ష్యం దిశగా తీసుకెళ్లాడు. రూథర్‌ఫర్డ్ (30 నాటౌట్‌బీ 18 బంతుల్లో 1ఐ4, 3ఐ6) సూపర్ షాట్లు ఆడాడు. చివరి 3 ఓవర్లలో 29 పరుగులు చేయాల్సివుండగా హేజిల్‌వుడ్ ఓవర్లో బట్లర్ రెండు సిక్స్‌లు, రూథర్‌ఫర్డ్ ఓ సిక్స్ బాదేసి మ్యాచ్‌ను ముగించాడు.

**విజృంభించిన సిరాజ్:** సిరాజ్, సాయికిశోర్ అద్భుత బౌలింగ్‌తో అంతకుముందు ఆర్సీబీని గుజరాత్ కట్టడి చేసింది. అయితే టాప్ ఆర్డర్ విఫలమైనా లివింగ్‌స్టన్, జితేశ్ శర్మ, డేవిడ్ మెరవడంతో ఆర్సీబీ కాస్త పోరాడే స్కోరు సాధించగలిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు ఆరంభం పేలవం. ఆ జట్టు తీవ్రంగా తడబడింది. నిరుటి వరకు ఆర్సీబీతో ఉన్న ఫాస్ట్‌బౌలర్ సిరాజ్.. పదునైన బౌలింగ్‌తో ఆ జట్టును బెంబేలెత్తించాడు. బెంగళూరు 7 ఓవర్లలో 48 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. రెండో ఓవర్లో అర్షద్ ఖాన్ బౌలింగ్‌లో కోహ్లి (7).. లాంగ్ లెగ్‌లో ప్రసిద్ధ్‌కృష్ణకు చిక్కాడు. ఆ తర్వాత సిరాజ్ ప్రత్యర్థిని దెబ్బతీశాడు. మూడో ఓవర్లో పడిక్కల్ (4)ను బౌల్డ్ చేసిన అతడు.. తన తర్వాతి ఓవర్లో హార్డ్ హిట్టర్ ఫిల్ సాల్ట్ (14)ను పెవిలియన్ చేర్చాడు. కెప్టెన్ రజత్ పాటిదార్ (12)ను ఇషాంత్ శర్మ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. అయితే ఆ తర్వాత గుజరాత్ బౌలింగ్‌లో జోరు కాస్త తగ్గింది. ఇబ్బందుల్లో ఉన్న ఆర్సీబీని లివింగ్‌స్టన్, జితేశ్ ఆదుకున్నారు. అయిదో వికెట్‌కు 38 బంతుల్లో 52 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. ఇద్దరిలో జితేశ్ దూకుడును ప్రదర్శించాడు. ఇషాంత్ ఓవర్లో రెండు ఫోర్లు, సిక్స్ బాదిన అతడు.. దూకుడు కొనసాగించాడు. 12 ఓవర్లలో 91/4తో ఆర్సీబీ కోలుకుంది. కానీ టోర్నీలో చక్కని బౌలింగ్‌తో ఆకట్టుకుంటోన్న స్పిన్నర్ సాయికిశోర్.. ఆ ప్రదర్శను కొనసాగిస్తూ జితేశ్‌ను ఔట్ చేశాడు. తన తర్వాతి ఓవర్లో కృనాల్‌ను కూడా వెనక్కి పంపి ఆర్సీబీని దెబ్బతీశాడు. 13 నుంచి 15 ఓవర్ల మధ్య మూడు ఓవర్లలో బెంగళూరుకు 14 పరుగులే వచ్చాయి. కానీ లివింగ్‌స్టన్, టిమ్ డేవిడ్ రెచ్చిపోవడంతో ఆఖరి 5 ఓవర్లలో ఆర్సీబీ 64 పరుగులు రాబట్టింది. తాను ఎదుర్కొన్న తొలి 28 బంతుల్లో 24 పరుగులు చేసిన లివింగ్‌స్టన్.. రషీద్ ఖాన్ వేసిన ఇన్నింగ్స్‌లో 18వ ఓవర్లో మూడు సిక్స్‌లు బాదేశాడు. తర్వాతి ఓవర్లో సిరాజ్ నాలుగు పరుగులే ఇచ్చి అతణ్ని వెనక్కి పంపాడు. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో ప్రసిద్ధ్ బౌలింగ్‌లో డేవిడ్ వరుసగా 4, 6, 4 దంచేసి ఔటయ్యాడు.


బట్లర్ 73నాటౌట్


సిరాజ్ 3/19



## ముంబయిని వీడిన జైస్వాల్

ముంబయి: భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. వ్యక్తిగత కారణాలతో దేశవాళీ క్రికెట్లో ముంబయి జట్టుకు గుడ్‌బై చెప్పాడు. 2025-26 సీజన్‌లో గోవాకు ఆడాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు ముంబయి క్రికెట్ సంఘానికి (ఎంసీఏ) మంగళవారం యశస్వి లేఖ రాయగా.. అతని నిర్ణయానికి ఎంసీఏ ఆమోదం తెలుపుతూ నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) మంజూరు చేసింది. "ఇది ఆశ్చర్యకర పరిణామమే. ఈ నిర్ణయం వెనుక అతను ఆలోచించే ఉంటాడు. తనను విడుదల చేయాలన్న యశస్వి విజ్ఞప్తికి ఆమోదం తెలిపాం" అని ఎంసీఏ అధికారి తెలిపాడు. భారత క్రికెటర్లు దేశవాళీలో ఆడటాన్ని బీసీసీఐ తప్పనిసరి చేయడంతో ఈ ఏడాది జనవరి 23-25 వరకు జమ్మూకశ్మీర్‌తో జరిగిన రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ముంబయి తరఫున యశస్వి చివరిసారిగా బరిలో దిగాడు. ఈ మ్యాచ్‌లో ముంబయి ఓడిపోగా.. యశస్వి వరుసగా 4, 26 పరుగులు సాధించాడు. "యశస్వి గోవాకు ఆడాలని అనుకుంటున్నాడు. అతడిని మేం స్వాగతిస్తున్నాం. వచ్చే సీజన్ నుంచి అతను గోవాకు ఆడతాడు. భారత జట్టు విధులు లేనప్పుడు గోవాకు యశస్వి సారథ్యం వహించొచ్చు" అని గోవా క్రికెట్ సంఘం కార్యదర్శి శంబా దేశాయ్ పేర్కొన్నాడు. 2022-23 సీజన్‌కు ముందు అర్జున్ తెండుల్కర్, సిద్ధేష్ లాడ్ కూడా ముంబయిని వీడి గోవా జట్టులో చేరారు.


జైస్వాల్



## సెమీస్‌లో జదుమణి

దిల్లీ: భారత బాక్సర్ జదుమణి మండెంగ్బామ్ (50కేజీ) ప్రపంచకప్ బాక్సింగ్ కప్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. 20 ఏళ్ల ఈ జాతీయ ఛాంపియన్ క్వార్టర్‌ఫైనల్ బౌట్లో 3-2తో బ్రిటన్‌కు చెందిన ఎలిస్ ట్రోబిడ్జ్‌పై విజయం సాధించాడు. జదుమణి సెమీస్‌లో అసిల్బెక్ జలిలోవ్ (ఉస్బెకిస్థాన్)తో తలపడతాడు. మరో ముగ్గురు భారత బాక్సర్లు నరేందర్ బెర్వాల్ ((90ంకేజీ), నిఖిల్ దూబె (75కేజీ),

జుగ్నూ (85కేజీ) క్వార్టర్‌ఫైనల్లో పరాజయం పాలయ్యారు. నరేందర్ 2-3తో సపార్‌బే (ఉజ్బెకిస్థాన్) చేతిలో, నిఖిల్ 0-5తో బెలిని (బ్రెజిల్) చేతిలో ఓడారు. జుగ్నూ 1-4తో అబ్దౌలాయె (ఫ్రాన్స్) చేతిలో కంగుతిన్నాడు. ఇంకా మనీష్ రాథోడ్ (55కేజీ), అభినాష్ (65కేజీ), హితేశ్ (70కేజీ) బరిలోకి దిగాల్సివుంది. ఈ టోర్నీ కోసం భారత్ 10 మందితో కూడిన జట్టును పంపింది. తొలి రోజు లక్ష్య చాహర్ (80కేజీ) తొలి రౌండ్లో ఓడిపోయాడు.

## ఈ-క్రికెట్ ముంబయి యజమానిగా సారా



ముంబయి: గ్లోబల్ ఈ-క్రికెట్ ప్రిమియర్ లీగ్ (జీఈపీఎల్)తో దిగ్గజ ఆటగాడు సచిన్ తెండుల్కర్ కుమార్తె సారా జట్టుకట్టింది. ఈ లీగ్‌లో ముంబయి ఫ్రాంచైజీని సారా తెండుల్కర్ కొనుగోలు చేసింది. జీఈపీఎల్ సీజన్-2లో ముంబయికి సారా యజమానిగా వ్యవహించనుందని జెట్‌సింథెసిస్ ప్రకటించింది. రియల్ క్రికెట్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై ఈజీపీఎల్ జరుగుతుంది.

## సొంతగడ్డపై నాలుగు టెస్టులు

### 2025లో టీమ్‌ఇండియా షెడ్యూల్ విడుదల

దిల్లీ: ఈ ఏడాది సొంతగడ్డపై క్రికెట్ షెడ్యూలును బీసీసీఐ ప్రకటించింది. 2025లో భారత్ నాలుగు టెస్టు మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనుంది. అహ్మదాబాద్, కోల్‌కతా, దిల్లీ, గువాహటి వేదికలు. భారత జట్టు వెస్టిండీస్‌తో రెండు టెస్టులు, దక్షిణాఫ్రికాతో రెండు టెస్టులు ఆడుతుంది. టెస్టు వేదికగా గువాహటి అరంగేట్రం చేయనుంది. అక్కడ దక్షిణాఫ్రికాతో రెండో టెస్టు జరుగుతుంది. దక్షిణాఫ్రికాతో భారత్ మూడు వన్డేలు, 5 టీ20 మ్యాచ్‌లు కూడా ఆడుతుంది. దక్షిణాఫ్రికా-భారత్ మూడో వన్డేకు డిసెంబరు 6న విశాఖపట్నం ఆతిథ్యమివ్వనుంది.

**భారత్‌లో వెస్టిండీస్ పర్యటన**

తొలి టెస్టు: అహ్మదాబాద్‌లో అక్టోబరు 6 నుంచి
రెండో టెస్టు: కోల్‌కతాలో అక్టోబరు 14 నుంచి

**భారత్‌లో దక్షిణాఫ్రికా పర్యటన**

తొలి టెస్టు: దిల్లీలో నవంబరు 18 నుంచి
రెండో టెస్టు: గువాహటిలో నవంబరు 26 నుంచి
తొలి వన్డే: రాంచి (నవంబరు 30)
రెండో వన్డే: రాయ్‌పూర్ (డిసెంబరు 3)
మూడో వన్డే: విశాఖపట్నం (డిసెంబరు 6)
తొలి టీ20: కటక్ (డిసెంబరు 9)
రెండో టీ20: చండీగఢ్ (డిసెంబరు 11)
మూడో టీ20: ధర్మశాల (డిసెంబరు 14)
నాలుగో టీ20: లఖ్‌నవూ (డిసెంబరు 17)
అయిదో టీ20: అహ్మదాబాద్ (డిసెంబరు 19)

